# క్రీడ

# ఇంగ్లండ్‌తో టీ20 సిరీస్ రేపే షురూ..



ఆస్ట్రేలియాతో ఐదు టెస్ట్‌ల సిరీస్‌ను 13తో కోల్పోయిన టీమిండియా వైట్‌బాల్ సిరీస్‌లకు సిద్ధమైంది. సొంతగడ్డపై ఇంగ్లండ్‌తో ఐదు టీ20ల సిరీస్‌తో పాటు మూడు వన్డేల సిరీస్ ఆడనుంది. ముందుగా టీ20 సిరీస్ జరగనుండగా.. బుధవారం కోల్‌కతా వేదికగా జరిగే తొలి మ్యాచ్ జరగనుంది. ఇప్పటికే ఇరు జట్లు కోల్‌కతా చేరి ప్రాక్టీస్ ప్రారంభించాయి. ఆస్ట్రేలియా పర్యటనలో ఆడిన ఆటగాళ్లంతా ఈ టీ20 సిరీస్‌కు దూరంగా ఉన్నాయి. సూర్యకుమార్ యాదవ్ సారథ్యంలో కుర్రాళ్లతో కూడిన జట్టు ఇంగ్లండ్‌తో తలపడనుంది. ఈ సిరీస్ కోసం బీసీసీఐ కోల్‌కతా వేదికగా 3 రోజుల ప్రాక్టీస్ క్యాంప్ ఏర్పాటు చేసింది. ఆదివారమే ఈ ప్రాక్టీస్ శిభిరం ప్రారంభమవ్వగా.. ఆటగాళ్లంతా పాల్గొని ముమ్మరంగా సాధన చేస్తున్నారు. టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ, ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా టీ20 ఫార్మాట్‌కు వీడ్కోలు పలికిన విషయం తెలిసిందే. వెన్ను గాయంతో జస్‌ప్రీత్ బుమ్రా ఈ టీ20 సిరీస్‌కు దూరంగా ఉండగా.. శుభ్‌మన్ గిల్, రిషభ్ పంత్, మహమ్మద్ సిరాజ్‌లకు విశ్రాంతినిచ్చారు. చీల మండ గాయంతో గత 14 నెలలుగా భారత జట్టుకు దూరంగా ఉన్న మహమ్మద్ షమీ.. ఈ సిరీస్‌తోనే రీఎంట్రీ ఇస్తున్నారు. ఈ సిరీస్ అతనికి కీలకంగా మారనుంది. ఈ సిరీస్‌లో సత్తా చాటి ఫిట్‌నెస్ నిరూపించుకుంటేనే అతను ఛాంపియన్స్ ట్రోఫీ 2025 జట్టులో కొనసాగనున్నాడు. మ్యాచ్‌లన్నీ భారత కాలమానం ప్రకారం రాత్రి 7 గంటలకు ప్రారంభం కానున్నాయి.

**ఇంగ్లండ్‌తో టీ20 సిరీస్ షెడ్యూల్..**

- జనవరి 22, తొలి టీ20(కోల్‌కతా)
- జనవరి 22, రెండో టీ20(చెన్నై)
- జనవరి 28, మూడో టీ20(రాజ్‌కోట్)
- జనవరి 31, నాలుగో టీ20(పుణె)
- ఫిబ్రవరి 2, ఐదో టీ20(ముంబై)

## లక్నో కెప్టెన్‌గా పంత్

అఫీషియల్ అనౌన్స్‌మెంట్!

టీమ్ ఇండియా యంగ్ ప్లేయర్ రిషభ్ పంత్ లక్నో సూపర్ జెయింట్స్ కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. అతడి ఎంపికను ఫ్రాంచైజీ ఓనర్ సంజీవ్ గొయెంకా సోమవారం ఖరారు చేశారు. పంత్‌సహా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న సంజీవ్ ఈ ప్రకటన చేశారు. భవిష్యత్‌లో పంత్ ఐపీఎల్ బెస్ట్ కెప్టెన్‌గా ఎదుగుతాడని సంజీవ్ నమ్మకం వ్యక్తం చేశారు.



కాగా, 2025 మెగా వేలంలో పంత్‌ను లఖ్‌నవూ రూ.27 కోట్ల భారీ ధరకు దక్కించుకుంది. ఇక పంత్ కంటే ముందు లఖ్‌నవూ జట్టుకు కేఎల్ రాహుల్, కృనాల్ పాండ్య, నికోలస్ పూరన్ నాయకత్వం వహించారు. మరోవైపు పంత్ గతంలో 2021, 2022, 2024 సీజన్లలో ఢిల్లీ క్యాపిటల్స్‌కు నాయకత్వం వహించాడు.

## చరిత్ర సృష్టించిన నైజీరియా

న్యూజిలాండ్‌పై సంచలన విజయం



క్రికెట్‌లో హిస్టరీలో సంచలన విజయం నమోదైంది. వరల్డ్ క్రికెట్‌లో అత్యంత పటిష్ఠమైన న్యూజిలాండ్ జట్టును పసికూన నైజీరియా ఓడించింది. 2025 మహిళల అండర్19 వరల్డ్‌కప్‌లో భాగంగా తాజాగా న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో నైజీరియా అమ్మాయిల జట్టు 2 పరుగుల స్వల్ప తేడాతో నెగ్గి చరిత్ర సృష్టించింది. దీంతో నైజీరియా అమ్మాయిల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. సంతోషంతో కేరింతలు కొడుతూ మైదానం అంతటా తిరిగి సంబరాలు చేసుకున్నారు. మలేసియా వేదికగా జరుగుతున్న ఈ టోర్నీలో సోమవారం న్యూజిలాండ్ నైజీరియా జట్లు తలపడ్డాయి. అయితే ఈ మ్యాచ్‌కు వర్షం తీవ్ర అంతరాయం కలిగించింది. దీంతో 20 ఓవర్లు సాగాల్సిన ఆటను నిర్వాహకులు ఇరువైపులా 13 ఓవర్లకు కుదించారు. తొలుత బ్యాటింగ్ చేసిన నైజీరియా మహిళల జట్టు 13 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 65 పరుగులు చేసింది. అనంతరం స్వల్ప లక్ష్య ఛేధనకు దిగిన న్యూజిలాండ్ 13ఓవర్లు ఆడి 636 స్కోర్‌కే పరిమితమైంది. అయితే చివరి 6 బంతుల్లో కివీస్ విజయానికి 9 పరుగులు అవసరమయ్యాయి. ఆ సమయంలో లిలియన్ ఉదేహ్ బంతి అందుకుంది. ఆఖరి ఓవర్ అద్భుతంగా బౌలింగ్ చేసి తన జట్టుకు చరిత్రాత్మక విజయం అందించింది. కాగా, అండర్ 19 టీ20 వరల్డ్‌కప్ హిస్టరీలో నైజీరియా జట్టుకు ఇదే తొలి విజయం కావడం విశేషం.



## ఆకట్టుకుంటున్న 'భైరవం' టీజర్

టాలీవుడ్‌లో తెరకెక్కుతున్న మల్టీస్టారర్ మూవీ 'భైరవం' ఇప్పటికే ప్రేక్షకుల్లో మంచి బజ్‌ని క్రియేట్ చేసింది. ఈ సినిమాలో బెల్లంకొండ సాయి శ్రీనివాస్, మంచు మనోజ్, నారా రోహిత్ నటిస్తుండటంతో ఈ సినిమా ఎలా ఉండబోతుందా అనే ఆసక్తి నెలకొంది. ఇక ఈ సినిమాను దర్శకుడు విజయ్ కనకమేడల డైరెక్ట్ చేస్తున్నాడు. ఇప్పటికే ఈ సినిమా పోస్టర్స్, ఫస్ట్ సింగిల్ సాంగ్ ప్రేక్షకుల్లో పాజిటివ్ వైబ్స్ క్రియేట్ చేశాయి. తాజాగా ఈ మూవీ టీజర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. ఆద్యంతం పవర్‌ఫుల్ మాస్ యాక్షన్‌తో ఈ టీజర్‌ను కట్ చేశారు. ముగ్గురు హీరోలు కూడా తమ పవర్‌ఫుల్ పర్ఫార్మెన్స్‌తో ప్రేక్షకులకు మంచి ట్రీట్ ఇచ్చేందుకు సిద్ధమవుతున్నట్లు ఈ టీజర్ చూస్తే అర్థమవుతుంది. ఇక ఈ టీజర్‌లో కొన్ని పవర్‌ఫుల్ డైలాగులు కూడా పేలాయి. భారీ క్యాస్టింగ్‌తో దర్శకుడు విజయ్ కనకమేడల ఈ చిత్రాన్ని తెరకెక్కించినట్లు టీజర్ చూస్తే తెలుస్తోంది. మొత్తంగా 'భైరవం' మూవీ ప్రేక్షకులను మెప్పించే కంటెంట్‌తో రాబోతుందని ఈ టీజర్ ప్రూవ్ చేసింది. ఇక ఈ సినిమాలో అదితి శంకర్, ఆనంది, సందీప్ రాజ్ తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాకు శ్రీచరణ్ పాకాల సంగీతం అందిస్తుండగా శ్రీ సత్యసాయి ఆరట్స్ బ్యానర్‌పై కె.కె.రాధామోహన్ ఈ చిత్రాన్ని ప్రొద్యూస్ చేస్తున్నారు.

# రీల్

## విజయ్ రంగరాజు కన్నుమూత



తెలుగు సీనియర్ నటుడు విజయ రంగరాజు గుండెపోటుతో సోమవారం మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న రంగరాజు, చెన్నైలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఇటీవల షూటింగ్‌లో గాయపడ్డ రంగరాజు చికిత్స కోసం చెన్నైలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేరారు. అయితే సడెన్‌గా గుండెపోటుకు గురై రంగరాజు మృతి చెందారు. ఆయన మృతి పట్ల టాలీవుడ్ ఇండస్ట్రీ దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. కాగా, 1994లో భైరవద్వీపం సినిమాతో ప్రేక్షకులకు పరిచయం అయ్యారు. 30 ఏళ్ల కెరీర్‌లో విలన్, సహాయ పాత్రలు పోషించారు. ముఖ్యంగా గోపిచంద్ 'యజ్ఞం' సినిమాతో రంగరాజుకు మంచి గుర్తింపు లభించింది. ఆ సినిమాలో విలన్‌గా ఆకట్టుకున్నారు.

## అమ్మ బయోపిక్ చేయాలనేదే నా కల

నరేశ్



సీనియర్ నటుడు నరేశ్ వీకే పుట్టిన రోజు నేడు. ఈ సందర్భంగా నటి పవిత్రతో కలిసి నరేశ్ తన అభిమానుల సమక్షంలో కేక్ కట్ చేశారు. ఈ క్రమంలో విలేకర్ల సమావేశంలో నరేశ్ మాట్లాడుతూ 'నా కెరీర్‌లో ఈ 2025 గుర్తుండిపోతుంది. ఏకకాలంలో తొమ్మిది సినిమాల్లో నటిస్తున్నాను. యువ దర్శకులు నాకోసమే రాస్తున్న పాత్రలతో ఇటు థియేటర్ లోనూ, అటు ఓటీటీ వేదికలతోనూ ప్రేక్షకుల్ని అలరించడం నేను అదృష్టంగా భావిస్తున్నాను' అని నరేశ్ తెలిపారు. నరేశ్ తన కలల సినిమాల గురించి మాట్లాడుతూ.. 'మా అమ్మ విజయనిర్మల బయోపిక్ చేయాలనేది నా కల. అది రాయగలిగితే నేనే రాస్తాను. అమ్మ కూడా ఆ మాటే చెప్పేవారు. అలాగే 'చిత్రం భళారే విచిత్రం', 'శ్రీవారికి ప్రేమలేఖ' సినిమాలకి కొనసాగింపు చిత్రాల్ని చేయాలన్నది మరో కల. కథలు రాయడం కూడా మొదలుపెట్టాను. భవిష్యత్తులో దర్శకత్వం చేయాలనే ఆలోచన కూడా ఉంది' అంటూ నరేశ్ చెప్పుకొచ్చారు.

## మృణాల్‌కి లక్కీ ఛాన్స్.. కానీ..!



సీతారామంతో సూపర్ హిట్ అందుకున్న మృణాల్ ఠాకూర్ తెలుగులో ఊహించని క్రేజ్ సొంతం చేసుకుంది. సీతా రామం తర్వాత వెంటనే హాయ్ నాన్న పడటం అది కూడా హిట్ అవ్వడంతో అమ్మడికి తిరుగు లేదని అనుకున్నారు. ఐతే థర్డ్ సినిమాగా చేసిన ఫ్యామిలీ స్టార్ షాక్ ఇవ్వడంతో కాస్త డల్ అయ్యింది. ఐతే మృణాల్ ఇటు టాలీవుడ్‌లోనే కాదు బాలీవుడ్‌లో కూడా దూసుకెళ్తుంది. అక్కడ కూడా వరుస సినిమాలతో అదరగొట్టేస్తుంది. మృణాల్ ఠాకూర్ సౌత్ క్రేజ్‌ని బాలీవుడ్ మేకర్స్ కూడా వాడుకోవాలని ఫిక్స్ అయ్యారు. 2013లో రాజమౌళి డైరెక్షన్‌లో వచ్చిన మర్యాద రామన్న రీమేక్‌గా బాలీవుడ్‌లో సన్ ఆఫ్ సర్దార్ సినిమా వచ్చింది. ఆ సినిమాకు సీక్వెల్‌గా పార్ట్ 2 చేస్తున్నారు. సన్ ఆఫ్ సర్దార్ 2లో మృణాల్ ఠాకూర్‌కి ఛాన్స్ వచ్చింది. అజయ్ దేవగన్ నటిస్తున్న ఈ సినిమాలో అవకాశం రావడం పట్ల అమ్మడు సంతోషపడుతుంది. రాజమౌళికి ఈ సన్ ఆఫ్ సర్దార్ 2కి ఏమాత్రం సంబంధం లేదు. ఐతే ఈ సీక్వెల్ మాత్రం ఆడియన్స్‌ని సర్ ప్రైజ్ చేస్తుందని అంటున్నారు మేకర్స్. ముఖ్యంగా మృణాల్‌కి ఇదొక మంచి అవకాశమని అంటున్నారు. తెలుగులో సీతారామం, హాయ్ నాన్న, ఫ్యామిలీ స్టార్ సినిమాల్లో తన అభినయంతో మెప్పించిన మృణాల్‌కి బాలీవుడ్‌లో కూడా అలాంటి ఛాన్స్ వచ్చిందని అంటున్నారు.

## ట్రంప్ ప్రమాణం

(మొదటి పేజీ తరువాయి)

ప్రకటించారు. ఈరోజు ప్రముఖ పౌరహక్కుల కార్యకర్త మార్టిన్ లూథర్ కింగ్ దినోత్సవమని గుర్తుచేశారు. జోబైడెన్ ప్రభుత్వంపై ఆయన తీవ్ర విమర్శలు చేశారు. దేశంలోకి వచ్చే అక్రమ వలసలను అరికట్టడంలో బైడెన్ ప్రభుత్వం విఫలమైందన్నారు. అమెరికా–మెక్సికో సరిహద్దుల్లో జాతీయ ఎమర్జెన్సీ ప్రకటిస్తూ ఒక ఫైలుపై సంతకం చేస్తానని ఆయన ప్రకటించారు. మెక్సికో సరిహద్దులకు మరిన్ని సైన్యాలను పంపుతామన్నారు. తక్షణమే అక్రమ వలసలను ఆపేస్తామని అన్నారు. లక్షలాదిమంది నేరస్తులు ఏ దేశం నుండి వచ్చి అక్రమంగా అమెరికాలో ప్రవేశించారో వారందరినీ తిరిగి బయలుదేరిన చోటకే తిప్పిపంపిస్తామన్నారు. అమెరికాలో విదేశీ నేర ముఠాలను అరికట్టేందుకు 1798 నాటి ఎఇఎ (ఏలియన్స్ ఎనిమీస్ యాక్ట్)ను పునరుద్ధరిస్తామని చెప్పారు. అక్రమ ప్రవేశాలను తక్షణం ఆపేస్తామన్నారు. ప్రపంచంలో ఏ దేశంలోనూ లేనంత చమురు, సహజవాయు నిక్షేపాలు అమెరికాలో ఉన్నాయనీ, ఇకమీదట వాటిని దేశం ఉపయోగించుకుంటుందని చెబుతూ 'డ్రిల్ బేబీ డ్రిల్...' అని హర్షధ్వానాలమధ్య ప్రకటించారు. అమెరికాలో 'నేషనల్ ఎనర్జీ ఎమర్జెన్సీ' ప్రకటిస్తానన్నారు. అమెరికా మళ్ళీ అతి సంపద్వంతమైన దేశంగా మారుతుందనీ, ఎందుకంటే మనకాళ్ళ కింద భూమిలో బంగారం చమురు నిక్షేపాల రూపంలో ఆవరించుకుని ఉందని అన్నారు. ఆటో ఇండస్ట్రీని అభివృద్ధి చేస్తామని, ఎలక్ట్రికల్ వాహనాలను పెంచుతామని అందుకు సంబంధించిన విస్తారమైన ప్రణాళిక అమలుచేస్తామన్నారు. అమెరికా మరోసారి ''తయారీరంగ దేశం''గా అవతరించబోతోందన్నారు. దేశంలో పోటీని నివారించి ధరలను నిత్యం చాలా హెచ్చుస్థాయిలో కొనసాగేందుకు ప్రయత్నం చేసే తయారీరంగ సరఫరాదారులను 'విదేశీ టెర్రరిస్టు సంస్థలు'గా ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేస్తామని చెప్పారు. దేశంలో ఎదురయ్యే ప్రతి సమస్యను ఎంతో గౌరవ ప్రదంగా, శక్తిసామర్థ్యాలతో ఎదుర్కొంటామని, జాతి,మతం,రంగు, మతం వంటి భేదాలకు అతీతంగా అమెరికాలో ప్రతి పౌరుడికీ అభివృద్ధినీ, సంపదను చేరువచేస్తామని అన్నారు. అమెరికా ఎన్నో సవాళ్ళు ఎదుర్కొంటున్నదనీ, నేరాలు అరికట్టి దేశ విద్యారంగంలో సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరం ఉందని చెప్పారు. దేవుడు తన ప్రాణాలను ఒక లక్ష్యం సాధించడంకోసం కాపాడాడని ట్రంప్ మరోసారి ప్రకటించారు. ఎన్నికల ప్రచార సమయంలో ఆయన రెండుసార్లు హత్యా ప్రయత్నాలనుండి తప్పించుకున్నారు.గడచిన ఎనిమిది సంవత్సరాలలో ఏ అధ్యక్షుడూ ఎదుర్కోనన్ని పరీక్షలను తాను ఎదుర్కొన్నానన్నారు.

**హర్షధ్వానాల మధ్య ట్రంప్–జె.డి.వాన్స్ ప్రమాణం**

ఎన్ని ఆటంకాలు ఎదురైనా పట్టువదలని విక్రమార్కుడిలా పంతం పట్టి తన కల నెరవేర్చుకున్న డోనాల్డ్ ట్రంప్ రెండోసారి అమెరికా 47వ అధ్యక్షుడుగా పదవీ ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్యాంగాన్ని రక్షిస్తానని ఆయన ప్రమాణ స్వీకారం చేశారు. అమెరికా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జాన్ రాబర్ట్స్ ఆయనతో ప్రమాణ స్వీకారం చేశారు. అమెరికా రాజ్యాంగాన్ని 'ప్రిజర్వ్, ప్రొటెక్ట్, డిఫెండ్ (రక్షించి, కాపాడి జాగ్రత్తగా సాకుతానని) అనే పదాలు ఉచ్చరించి ప్రమాణం చేశారు. జె.డి.వాన్స్ ఉపాధ్యక్షుడుగా పదవీ ప్రమాణ స్వీకారం చేశారు.

వాషింగ్టన్‌లో ఆరుబయట గడ్డకట్టే చలిగాలులు మైనస్ 11 డిగ్రీలకు పడిపోయిన ఉష్ణోగ్రతలమధ్య సంప్రదాయినికి విరుద్ధంగా క్యాపిటల్ హిల్ రొటుండా భవంతి హాలులో అతిథులకు ప్రత్యేకంగా 700 సీట్లు కేటాయించారు. 20 వేల మందికిపైగా దేశ విదేశీ నాయకులు, అతిథులు, ఆత్మీయుల మధ్య భారత కాలమానం ప్రకారం సోమవారం రాత్రి 10.30 గంటలకు అధ్యక్ష పదవీ బాధ్యతలు చేపట్టారు. ఆయనతోపాటు సహచరుడు జె.డి.వాన్స్ కూడా అమెరికా ఉపాధ్యక్షుడుగా పదవీ బాధ్యతలు తీసుకున్నారు. ప్రమాణ స్వీకారం అనంతరం అధ్యక్ష హోదాలో సుదీర్ఘ ప్రసంగం చేశారు. అమెరికా ఫస్ట్‌లేడీ, ట్రంప్ సతీమణి మెలనియా ట్రంప్ చిరునవ్వులు చిందిస్తూ, చప్పట్లు కొడుతూ ఈ తతంగాన్ని తిలకించారు. కొత్త ప్రభుత్వంలో మంత్రులుగా బాధ్యతలు చేపట్టబోతున్న ట్రంప్ సహచరులు, పదవీ విరమణ చేస్తున్న అధ్యక్షుడు జో బైడెన్, ఉపాధ్యక్షురాలు కమలాహారిస్, అమెరికా మాజీ దేశాధ్యక్షులు బరాక్ ఒబామా, జార్జి బుష్, లారా, క్లింటన్, తదితరులు పాల్గొన్నారు. ప్రమాణ స్వీకారోత్సవంలో భారత్ తరపున విదేశాంగమంత్రి జైశంకర్ పాల్గొన్నారు. భారతదేశ సంపన్నుడు ముఖేశ్ అంబానీ, ఆయన సంతీమణి పాల్గొన్నడంతోపాటు ముందురోజు వారిద్దరూ ట్రంప్‌తో భేటీ అయ్యారు. ట్రంప్ విధాన నిర్ణయాల అమలులో కీలకపాత్ర పోషిస్తున్న ఎలాన్‌మస్క్‌తోపాటు టెక్ బిలియనీర్లు మార్క్ జుకర్‌బెర్గ్, జెఫ్ బెజోస్, సుందర్ పిచాయ్ తదితరులు పాల్గొన్నారు. చైనా తరపున ఆ దేశ ఉపాధ్యక్షుడు హాన్ జెంగ్‌సహా పలు దేశాల నాయకులు హాజరయ్యారు.

**భారీ భద్రతా ఏర్పాట్లు**

ట్రంప్ ప్రమాణ స్వీకారోత్సవం సందర్భంగా భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. 48 కి.మీ మేరక భద్రతా వలయాన్ని ఏర్పాటు చేశారు. 25,000మంది భద్రతా సిబ్బందిని మోహరించారు. కట్టుదిట్టంగా ఎలాంటి సమస్యలూ రాకుండా పహారా ఏర్పాటు చేశారు. అతిథులను పరిమితం చేశారు. చలిగాలులు ఉన్నప్పటికీ మెరికావ్యాప్తంగా వచ్చే అభిమానులను రాకుండా అడ్డుకోలేదు. వారి సొంత దుస్తుల ఏర్పాట్లు చేసుకుని రమ్మని సలహా ఇచ్చారు. సుమారు 2.20 లక్షల ఇనాగరేషన్ టిక్కెట్లు విక్రయించారు.

**రాత్రికి రాత్రే క్రిప్టో బిలియనీర్‌గా మారిన ట్రంప్**

డోనాల్డ్ ట్రంప్ రాత్రికి రాత్రే క్రిప్టో బిలియనీర్‌గా మారిపోయారు. క్రిప్టో–బిట్ కాయిన్‌లకు అమెరికాను ప్రపంచ రాజధానిగా మారుస్తానని అంతకుముందు విపరీతమైన చలిలో కూడా మద్దతుదారులతో జరిపిన ర్యాలీ సందర్భంగా ప్రకటించారు. ఫస్ట్ లేడీ మెలనియా ట్రంప్ స్వయంగా మెలనియా ట్రంప్ పేరుతో ఒక క్రిప్టో కరెన్సీ కాయిన్‌ను ప్రకటించారు. ట్రంప్ ప్రమాణస్వీకారోత్సవం సందర్భంగా ఆమె దీనిని పునరుద్ధరించారు. ఇంతకుముందే ఆమె ఈ కరెన్సీని విడుదల చేశారు. ఎక్స్ వేదికగా ఆమె ఆదివారంనాడు ఈ ప్రకటన చేశారు. ట్రంప్ తన ట్రంప్ క్రిప్టో కరెన్సీని విడుదల చేసిన తర్వాత అధికారికంగా మెలనియా మీమ్ ప్రకటన వచ్చింది. ఈ విధంగా మెలనియా, ట్రంప్ పేరిట రెండు క్రిప్టో కరెన్సీ కాయిన్స్ వచ్చాయి. కాయిన్ మార్కెట్ కాప్ వెబ్‌సైటు ప్రకారం ట్రంప్ టోటల్ మార్కెట్ విలువ 12 బిలియన్ డాలర్లు ఉండగా, మెలనియా మార్కెట్ విలువ 1.7 బిలియన్ డాలర్లుగా ఉంది. 2024 ఎన్నికలకు ముందు డోనాల్ ట్రంప్ క్రిప్టో కరెన్సీని పెద్ద స్కామ్‌గా అభివర్ణించారు. మూడోసారి ఎన్నికల్లో అభ్యర్థిగా ఆయన ఖరారు అయ్యాక క్రిప్టో కరెన్సీని ఆయన డొనేషన్లుగా స్వీకరించారు. క్రిప్టో కరెన్సీకి ఆయన ఇప్పుడు బ్రహ్మరథం పడుతున్నారు. ఎన్నికల ప్రచార సమయంలో ట్రంప్ కుటుంబం ''వరల్డ్ లిబర్టీ ఫైనాన్సియల్'' పేరుతో ఒక క్రిప్టో కరెన్సీని ప్రారంభించింది.

## సమావేశమవ్వాలి

(మొదటి పేజీ తరువాయి)

నేత సర్వన్ సింగ్ పంధే ర్ మీడియాతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతులతో నిర్వహిం చ తలపెట్టిన సమావేశ తేదీ చాలా దూరంగా ఉందన్నారు. సమావేశమయ్యేందుకు ప్రభుత్వం చాలా సమయం తీసుకుందన్నారు. అయితే అతి తొందరగా సమావేశం నిర్వహించాలని, ఇది తమ విజ్ఞప్తి కాదని, తమ డిమాండ్ అని పంధేర్ పేర్కొన్నారు. అది కూడా ఢిల్లీలోని నిర్వహించాలన్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఫిబ్రవరి 9వ తేదీ వరకు మోడల్ కోడ్ ఉన్నందున ఫిబ్రవరి 14వ తేదీన సమావేశ తేదీను ఖరారు చేసినట్లు రైతులు చెప్పారన్నారు. దీనిపై పంధేర్‌ను ప్రశ్నించగా రాజ్యాంగపరమైన 8వ పే కమిషన్‌ను కేంద్రం ప్రకటించినప్పటికీ ఎన్నికల కమిషన్ ఎలాంటి అభ్యంతరం చెప్పలేదుగా అని ప్రశ్నించారు. ఈ తురణంలో ఇంకా కొంచం తొందరంగా రైతులతో సమావేశమైతే ఏమవుతదన్నారు. మరో రైతు నేత ఎంఎస్ రాయ్ మాట్లాడుతూ ఫిబ్రవరి 14వ తేదీన సమావేశం కావడమంటే పూర్తి జాప్యమేనన్నారు. తొందరగా నిర్వహిస్తారని తాము భావిస్తున్నామన్నారు. మోడల్ కోడం ఉందని సాకులు చెప్పడం రైతులను తప్పుదారి పట్టించడమేనన్నారు. ఇదిలా ఉండగా, కేంద్ర బృందం శనివారం ప్రతిపాదిత సమావేశాన్ని ప్రకటించిన తరువాత వైద్య సహాయానికి డల్లేవాల్ అంగీకరించినప్పటికీ దీక్ష విరమించేందుకు నిరాకరించారు. దీంతో డల్లేవాల్ ఆమరణ దీక్ష కూడా విరమించాలని, సమావేశంలో పాల్గొని కెఎంఎంనేత విజ్ఞప్తి చేశారు. ఆహారం తీసుకోకుండా వైద్య సహాయం పొందినా లాభం లేదని డల్లేవాల్‌కు వైద్యం అందించిన డాక్టర్ స్వాయ్‌మాన్ సింగ్ కూడా చెప్పారన్నారు. ఇది అతిపెద్ద పోరాటమన్నారు. రానున్న రోజుల్లో పోరాటాన్ని మరింత ఉధృతం చేయాల్సిన అవసరముందని పంధేర్ పేర్కొన్నారు. ప్రభుత్వంతో పోరాటం చేస్తామని, అందుకు ప్రధాన నాయకుడు ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. ఈ నేపథ్యంలో ఆహారం తీసుకోవాలని డల్లేవాల్‌ను కోరారు. తమ డిమాండ్ల అమలు కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని చెప్పారు.

## ప్రియురాలికి మరణశిక్ష

(మొదటి పేజీ తరువాయి)

చేసింది. కుట్రపూరితంగానే అతడికి ఇచ్చిన జ్యూస్‌లో హానికారక పదార్థాలు కలిపింది. అయినా తన మోసాన్ని కప్పిపుచ్చుకునేందుకు యత్నించింది. గ్రీష్మకు షారన్ ఎన్నడు కూడా తప్పుడు మెసేజ్‌లు పంపలేదు. ఆమెపై నిందలు మోపలేదు. షారన్ రెచ్చగొట్టకపోయినా, ఘర్షణకు దిగకపోయినా అతడి ప్రాణాలను గ్రీష్మ తీయడం నేరమే' అని న్యాయస్థానం పేర్కొంది. అయితే తనకు శిక్షను తగ్గించాలని గ్రీష్మ న్యాయస్థానాన్ని కోరింది. ఉన్నత చదువులు చదివానని, ముందు కూడా తనపై ఎలాంటి నేర చరిత్ర లేదని పేర్కొంది. అంతేకాకుండా తన తల్లిదండ్రులకు ఏకైక కుమార్తె అని, ఇవన్నీ చూసి తనకు శిక్షను తగ్గించాలని కోర్టును అభ్యర్థించింది. అయితే, న్యాయస్థానం ఈ వాదనలను తోసిపుచ్చింది. కాగా, తిరువనంతపురంలోని పరశాలలో నివసించే షారన్ 2022 అక్టోబర్ 25న మృతి చెందాడు. ఆయన మృతి పట్ల అనుమానంతో అతని కుటుంబ సభ్యులు తమిళనాడులోని రామవర్మంచిరలోని అతని ప్రేయసి గ్రీష్మపై కేసు నమోదు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన పోలీసులకు గ్రీష్మ తన కుటుంబ సభ్యులతో కలిసి షారన్‌ను చంపినట్లు అంగీకరించింది. తనకు మరో యువకుడితో పెళ్లి కుదిరిందని, అయితే వివాహం జరిగితే మొదటి భర్త చనిపోతాడని జ్యోతిషుడు చెప్పడం వల్లే ఈ దారుణానికి పాల్పడినట్లు తెలిపింది. తాను గతంలో ఎవరికీ తెలియకుండా ఓ చర్చిలో షారన్‌ను వివాహం చేసుకున్నట్లు వెల్లడించింది. ప్రణాళిక ప్రకారం 2022 సెప్టెంబర్ 14న తమిళనాడులోని రామవర్మంచిర్‌లో ఉన్న తన ఇంటికి షారన్‌ను పిలిచింది గ్రీష్మ. అయితే అక్కడ వారు జ్యూస్ తాగే పోటీని పెట్టుకున్నారు. గ్రీష్మ షారన్‌కు ఇచ్చిన జ్యూస్‌లో కాపర్ సల్ఫేట్ కలిపి ఇచ్చింది. అది తాగిన షారన్ అపస్మారక స్థితికి చేరుకున్నాడు. అనంతరం ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. విషం తాగిన కారణంగానే షారన్ మృతి చెందినట్లు పోస్టుమార్టం నివేదికలో తేలింది. ఈ విషయాన్ని రుజువు చేసేలా గ్రీష్మ, షారన్ మధ్య వాట్సాప్ చాటింగ్‌లు లభించాయి. ఈ కేసు విషయంలో 2023 జనవరి 25న పోలీసులు ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. 2024 అక్టోబరు 15న కోర్టులో మొదలైన విచారణ ప్రక్రియ ఈ ఏడాది జనవరి 3న ముగిసింది. ఎట్టకేలకు సోమవారం(జనవరి 20) తీర్పును వెలువరించారు.

## మరింత లోతుగా విచారణ

(మొదటి పేజీ తరువాయి)

పాటు గ్రీన్‌కో సంస్థల ఎండి అనీల్‌కుమార్‌తో పాటు ఏసెనెక్ట్స్ జెన్ సంస్థ ప్రతినిధులను ఎసిబి విచారించింది. వీరందరు ఇచ్చిన వాంగ్మూలాలపై న్యాయ నిపుణులతో ఎసిబి అధికారులు చర్చిస్తున్నారు. అయితే ఈ కేసులో పరస్పర వాంగ్మూలాలు రావడంతో నిందితులను మరోసారి విచారించి రుడీ చేసుకోవాలని దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు. సీజన్ 10తో పాటు నాలుగు సీజన్లకు ఒప్పందం చేసుకున్నప్పటికీ ఎందుకు ఒప్పందం నుంచి తప్పుకోవాల్సి వచ్చిందని ఏస్నెక్స్ట్ జెన్ కంపనీ ప్రతినిధులను ఎసిబి వివరణ కోరింది. అలాగే 10వ సీజన్ నిర్వహించాల్సి ఉండగా ఎందుకు ఒప్పందం నుంచి వైదొలగ డం వెనుక కారణాలపై ఎసిబి లోతుగా ఆరా తీశారు. 9వ సీజన్ కోసం ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందంలో పేర్కొన్న అంశాలపైనా ప్రశ్నించారు. ఫార్ములాఈ రేస్ దర్యాప్తు కీలకంగా మారిన గ్రీన్‌కో అనుబంధ సంస్థల ఎలక్ట్రోరల్ బాండ్ల వ్యవహారంపై ఎసిబి క్విడ్ ప్రోకో కోణంలో విచారణ చేపట్టింది. ఫార్ములాఈ ఒప్పం దానికి ముందు ఎలక్ట్రోరల్ బాండ్ల రూపంలో బిఆర్ఎస్‌కు రూ.41 కోట్లు చెల్లించడంపై వివరణ కోరింది. 2022 అక్టోబరు 25న రేసు నిర్వహణకు త్రైపాక్షిక ఒప్పందం జరిగితే అంత కుముందు ఆదే ఏడాది ఏప్రిల్‌లో రూ.31 కోట్లు, అక్టోబర్లో రూ.10కోట్లు గ్రీన్ అనుబంధ సంస్థలు బిఆర్ఎస్ ఎలక్ట్రోరలా బాండ్లను ఎందుకు సమకూర్చారంటూ ఎసిబి ఆరా తీస్తుంది. మాదాపూర్‌లోని గ్రీన్ కో ఆఫీసు, గ్రీన్‌కో అనుబంధ సంస్థ ఏస్ నెక్స్ట్ జెన్‌లోనూ సోదాలలో లభించిన ఆధారాలపై ఎసిబి ఆరా తీసింది. ఫార్ములా ఈ కార్ రేస్‌కు సంబంధించి నిధులు ఏ అకౌంట్ నుంచి వచ్చాయనే అంశంపైఎసిబి అధికారులు కీలక ఆధారాలు సేకరించారు. విచారణలో భాగంగాఎసిబి సోదాలలో లభించిన ఆధారాలను ఏస్ నెక్ట్స్ జెన్ డైరెక్టర్ చలమశెట్టి సునీల్ కు ఎదుట ఉంచి ఎసిబి కీలక ప్రశ్నలు సంధించిన విషయం తెలిసిందే.

**నష్టంతోనే తప్పుకున్నాం..**

ఫార్ములా ఈరేసు వ్యవహారంలో మొదటి ఒప్పందం ప్రకారం సీజన్ 9, 10, 11, 12 రేస్ల నిర్వహణ ఖర్చులను ఎస్ నెకట్స్ జెన్ భరిస్తామని ఒప్పందంలో పేర్కొన్న అంశాలపై ఎసిబి ఆ సంస్థ ప్రతినిధులను సూటిగా ప్రశ్నించింది. ఈ క్రమంలో 2023 ఫిబ్రవరి 10, 11 తేదీల్లో సీజన్9 ఫార్ములా ఈరేస్లో లావాదేవీలపై వివరణ కోరింది. అలాగే 2024 ఫి బ్రవరిలో జరగాల్సిన సీజన్10 రేస్ కోసం ఫార్ములాఈ ఆపరేషన్స్ (ఎఫ్ఇఒ) సంస్థకు 2023 మే లోనే 50 శాతం సొమ్ము (రూ.30 కోట్లు) చెల్లించాల్సి ఉండగా ఏస్నెకట్స్ జెన్ కంపెనీ ఎందుకు ముందుకు రాలేదని ఎసిబి అధికారులు విచారణ చేపట్టారు. దీంతో సీజన్9 ఫార్ములా ఈరేసు నిర్వాహణతో తమకు భారీగా నష్టం వాటిల్లిందంటూ ఎస్ నెకట్స్ జెన్ కంపెనీ చేతులెత్తేసినట్లు ఎస్ నెకట్స్ జెన్ ప్రతినిధులు సమాధానం ఇచ్చినట్లు తెలియ వచ్చింది. తాము తప్పుకోవడంతో హెచ్ఎండిఎను ప్రమోటర్‌గా అప్పటి పురపాలక శాఖ మంత్రి కెటిఆర్ చేర్చారని విచారణలో ఎస్ నెకట్స్ జెన్ ప్రతినిధులు వివరించారు. ఇందులో భాగంగానే 2023 అక్టోబరు 5, 11 తేదీల్లో రూ.45.71 కోట్లను ఎఫ్ఇవోకు హెచ్ఎండిఎ నేరుగా బదిలీ చేసిందని ఏస్ నెకట్స్ జెన్ ప్రతినిధులువాంగ్మూలం ఇచ్చారు. కాగా ఒప్పందం నుంచి అర్ధాంతరంగా తప్పుకొన్న ఎస్ నెకట్స్ జెన్ సంస్థపై అప్పటి ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుందన్న కోణంలోనూ ఎసిబి ఆరా తీస్తున్నారు.ఈ నేపథ్యంలోనే నిందితులను మరోసారి విచారించిన తరువాతనే నిర్ధారణకు రావాల్సి ఉంటుందని ఎసిబి అధికారులు అభిప్రాయపడుతున్నారు.






Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad - 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com